సాక్షి నల్లగొండ

గురువారం । 4 । మే । 2023



శ్రీకృష్ణాలంకార సేవలో..
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీస్వామి వారి జయంత్యుత్సవాలు కొనసాగుతున్నాయి. - 8లో



తిరుకల్యాణోత్సవాలు ప్రారంభం
మట్టపల్లి నృసింహుడి దేవాలయంలో తిరుకల్యాణోత్సవాలను బుధవారం రాత్రి ప్రారంభించారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
35° / 22°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు హర్యానా గవర్నర్ దత్తాత్రేయ రాక

మునుగోడు : మండలంలోని కొరటికల్ గ్రామంలో పునర్నిర్మించిన కేదారేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలకు గురువారం హర్యానా గవర్నర్ దత్తాత్రేయ రాన్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గంగిడి మనోహర్‌రెడ్డి తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

బ్యూటీషియన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ టౌన్ : జిల్లా కేంద్రంలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సుల్లో శిక్షణ పొందడానికి 15–18 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన కిశోర బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కేంద్రం జిల్లా మేనేజర్ ఎ.అనిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన వారు యోగ్యతా పత్రాల జిరాక్స్, పాస్ ఫొటో, ఆధార్ జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఉమ్మడి జిల్లాలోని ఆయా సీడీపీఓ కార్యాలయాల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.


635.50 అడుగులకు మూసీ నీటిమట్టం



మూసీ రిజర్వాయర్‌లో నీరు

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం రోజురోజుకు పెరుగుతోంది. హైదరాబాద్‌తోపాటు మూసీ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో బుధవారం ప్రాజెక్టులోకి 3,172 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 645 (4.46 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి నీటిమట్టం 634.50 (2.26 టీఎంసీలు) అడుగులకు చేరుకుంది. ఏప్రిల్ నెలలో మూసీ కాల్వలకు నీటిని నిలిపివేసే నాటికి ప్రాజెక్టులో నీటిమట్టం 625 అడుగులుగా ఉంది. పది రోజుల నుంచి వస్తున్న వరదతో రోజుకు అడుగు చొప్పున నీటిమట్టం పెరుగుతోంది.

దర్వేశిపురం ఆలయ హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

కనగల్ : మండల పరిధిలోని దర్వేశిపురం (పర్వతగిరి) శ్రీ రేణుకఎల్లమ్మ ఆలయ హుండీని బుధవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో లెక్కించారు. 85రోజులకుగాను రూ.11,92,514ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ జల్లేపల్లి జయరామయ్య తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్లు నల్లబోతు యాదగిరి, కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి, చనగాని యాదగిరిగౌడ్, బీఆర్ఎస్ నాయకులు అల్లుబెల్లి నర్సింహారెడ్డి, నకిరేకంటి సైదులు, చనగాని రామచంద్రు, అర్చకులు మల్లాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఇంటింటికీ సీపీఐ ప్రచార యాత్ర



మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

చింతపల్లి : నల్లగొండ జిల్లా సమగ్ర అభివృద్ధి సాధించాలని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా డిండి లిఫ్టును పూర్తి చేయాలని ఏప్రిల్16 నుంచి మే 3 వరకు సీపీఐ చేపట్టిన ఇంటింటికి ప్రచార యాత్ర ముగిసింది. బుధవారం చింతపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు మాట్లాడుతూ ఈనెల 5న చండూరులో సీపీఐ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, పల్లె నర్సింహ, ఎండీ.మైనొద్దీన్, వెంకటయ్య, రాధాకృష్ణ, లక్ష్మయ్య, గణేశ్, శేఖర్ ఉన్నారు.

• సొంతింటి కల నెరవేరిన వేళ..



నార్కట్‌పల్లి : నక్కలపల్లిలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే లింగయ్య తదితరులు

• ఉద్యోగులుగా గుర్తించాలి



సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఐకేపీ వీఓఏలు

అపరాల సాగు పెంచేలా..

- వరి, పత్తి సాగును తగ్గించే దిశగా వ్యవసాయ శాఖ కసరత్తు
- పప్పు ధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు సన్నాహాలు
- ఈ వానాకాలంలో 50 వేల ఎకరాల్లో సాగు చేయించేలా ప్రణాళిక

నల్లగొండ అగ్రికల్చర్ : పప్పు ధాన్యాలైన కంది, పెసర, మినుము తదితర పంటల సాగు పెంచేందుకు వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తోంది. ప్రస్తుత వానాకాలంలో అపరాల సాగు పైపు రైతులను చైతన్యం చేసేందుకు జిల్లా వ్యవసాయ శాఖ ప్రణాళికను రూపొందిస్తోంది. ముందుగా రైతులకు అవగాహన కల్పించడం, సాగులో మెళకువలను అందించడం, పప్పు ధాన్యాలకు మార్కెంగ్ సౌకర్యం కల్పించడం వంటి విషయాలను క్షేత్ర స్థాయిలో రైతులకు చేరవేయాలని నిర్ణయించినట్లు సమాచారం. అవసరమైతే గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధుల సహకారం కూడా తీసుకోవాలని నిర్ణయించింది.

తగ్గుతున్న పుప్పుధాన్యాల సాగు..
జిల్లాలో ఏటేటా పప్పుధాన్యాల సాగు తగ్గిపోతోంది. కేవలం వరి, పత్తి పంటల సాగుపైనే రైతులు మొగ్గు చూపుతున్నారు. పప్పు ధాన్యాల పంటల సాగు తగ్గడంతో పప్పుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మరోవైపు వరి, పత్తి పంటల సాగుకు మొగ్గుచూపుతున్న రైతులు వాటిని అమ్ముకోవడానికి ఏటా అరిగోస పడుతున్న విషయం తెలిసిందే. దీనిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం వరి, పత్తి పంటల సాగును తగ్గించడంతో పాటు రైతులను పప్పుధాన్యాల సాగువైపు మళ్లించాలని నిర్ణయించింది.



2017 నుంచి వానాకాలంలో పంటల సాగు ఇలా.. (ఎకరాల్లో)

సంవత్సరం	వరి	పత్తి	కంది	పెసర	మినుము
2017	1,59,152	5,83,800	19,997	3140	235
2018	2,36,298	5,69,583	15990	1160	0
2019	3,22,630	6,84,475	14,088	560	350
2020	4,01,124	7,29,399	21,154	1,044	76
2021	4,62,075	6,53,767	10,807	329	8
2022	5,04,208	6,45,775	3,273	88	38

అగ్రభాగం పత్తిదే..
2022 వానాకాలంలో మొత్తం 11,20,657 ఎకరాలలో వివిధ పంటలను సాగు చేశారు. అందులో అగ్రభాగంగా పత్తి 6,41,098 ఎకరాల్లో, ఆ తరువాత స్థానంలో వరి 4,74,547 ఎకరాల్లో సాగు చేశారు. పప్పుధాన్యాల పంటలైన కంది 3,193, పెసర 87, మినుము 38 ఎకరాల్లో మాత్రం రైతులు సాగు చేశారు. అయితే ధాన్యం, పత్తిని అమ్ముకోవడానికి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. దీంతో రైతులను పప్పుధాన్యాల పంటల సాగువైపు మళ్లించి వారి ఇబ్బందులు తొలగించాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. ఆ దిశగా జిల్లా వ్యవసాయ శాఖ పత్తి, వరి సాగును కొంత మేరకు తగ్గించాలని, పుప్పుధాన్యాల సాగును మాత్రం జిల్లాలో సుమారు 50వేల ఎకరాలకు పెంచాలనే లక్ష్యంగా ప్రణాళికను సిద్ధం చేస్తోంది. వీటిలో కంది పంటను ఎక్కువ మొత్తంలో సాగు చేయించాలని నిర్ణయించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఐదు సంవత్సరాలుగా విత్తనాలపై సబ్సిడీని ఎత్తివేయడంతో ఆ పంటల సాగుకు రైతులు మొగ్గుచూపడం లేదనే వాదన వినిపిస్తోంది. ప్రభుత్వం ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పప్పుధాన్యాల విత్తనాలను సబ్సిడీపై అందిస్తే మాత్రం వ్యవసాయ శాఖ ఆశించిన స్థాయిలో పప్పుధాన్యాల సాగు పెరిగే అవకాశం ఉంది.

కంది సాగును పెంచుతాం



పప్పు ధాన్యాలైన కంది, పెసర, మినుము పంటల సాగు ఏటేటా తగ్గిపోతోంది. వరి, పత్తి పంటల వైపే రైతులు మొగ్గుచూపుతున్నారు. జిల్లాలో పప్పుధాన్యాల సాగును పెంచాలని నిర్ణయించాం. ముఖ్యంగా కంది సాగు ఎక్కువ మొత్తంలో పెంచేందుకు రైతులకు అవగాహన కల్పిస్తాం. పెసర, మినుము సాగును కూడా పెంచే దిశగా ప్రణాళికను రూపొందిస్తున్నాం.

– వై.సుచరిత డీఏఓ

నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి
- ప్రాజెక్టుల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై సమీక్ష

నల్లగొండ : డిండి ఎత్తిపోతల పథకం కింద శివన్నగూడెం రిజర్వాయర్ ముంపు గ్రామమైన నర్సిరెడ్డిగూడెం వాసులకు చింతపల్లి గ్రామంలో పునరావాసం కల్పించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) భాస్కర్‌రావు, ఆర్డీఓలు, వివిధ శాఖల అధికారులతో కిష్టరాయినిపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్, ఉదయ సముద్రం, అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణ, నష్ట పరిహారం చెల్లింపు, శివన్నగూడెం, నర్సిరెడ్డిగూడెం గ్రామ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివన్నగూడెం రిజర్వాయర్‌లో ముంపు గ్రామమైన నర్సిరెడ్డిగూడెం గ్రామస్తులకు చింతపల్లిలో పునరావాసానికి సంబంధించి భూసేకరణ పూర్తయినందున ఆ భూములను ఇరిగేషన్ శాఖకు అప్పగించాలని అధికారులకు సూచించారు. చింతపల్లిలో లేఅవుట్ వేసి ప్లాట్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనతోపాటు అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం భూసేకరణలో జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేసేందుకు సంబంధిత ఏజెన్సీతో వారం రోజుల్లో మార్కింగ్ పూర్తి చేయించాలన్నారు. భూసేకరణ పూర్తయిన దగ్గర వెంటనే పనులు జరిగేలా ఆర్డీఓలు.. తహసీల్దార్లను సమన్వయం చేసి పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో భూ సేకరణ ప్రత్యేక కలెక్టర్ రోహిత్‌సింగ్, ఆర్డీఓలు జయచంద్రారెడ్డి, గోపిరామ్‌నాయక్, వివిధ శాఖల ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

బ్రాహ్మణవెల్లెంల - ఉదయ సముద్రం ట్రయల్‌రన్

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండల పరిధిలోని బ్రాహ్మణ వెల్లెంల – ఉదయ సముద్రం ప్రాజెక్టు పంపులను బుధవారం ట్రయల్ రన్ నిర్వహించారు. పనుల్లో భాగంగా పంపులు సక్రమంగా పని చేస్తునాయా లేదా అని తెలుసుకునేందుకు అధికారులు రాష్ట్ర లిఫ్ట్ అడ్వైజర్ ఆధ్వర్యంలో ట్రయల్ రన్ చేసినట్లు తెలిసింది. అయితే కొన్ని మోటార్ల పని చేయలేదని సమాచారం. కాగా తమ ఏళ్ల నాటి కల నెరవేరుతోందన్న విషయం తెలిసిన వెంటనే బి.వెల్లెంల, చౌడంపల్లి గ్రామస్తులు ఆ ప్రాంతానికి వెళ్లినా.. ఎవరికీ అనుమతి ఇవ్వలేదని తెలిసింది. బుధవారం రాత్రి ఎమ్మెల్యే చిరుమర్తి ఆ ప్రాంతాన్ని సందర్శించారు.



పంపుల ద్వారా వస్తున్న నీరు

ఉపాధ్యాయులంతా పీఆర్‌టీయూ వైపే..



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి, చిత్రంలో సంఘం బాధ్యులు

- పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

నల్లగొండ : ఉపాధ్యాయులంతా పీఆర్‌టీయూ సంఘం వైపే ఉన్నారని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఆ సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం బుధవారం నల్లగొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌తో చర్చించి నూతన పీఆర్సీ కమిటీని నియమించేందుకు కృషి చేస్తామన్నారు. ఉద్యోగులకు నగదు రహిత చికిత్సను అందించేందుకు త్వరలోనే ప్రభుత్వం హెల్త్ స్కీం ప్రకటించనుందన్నారు. సంఘంలో రెండు దశాబ్దాల పాటు పదవులు అనుభవించిన ఓ వ్యక్తి సంఘానికి వెన్నుపోటు పొడిచేలా వ్యవహరించారని చెప్పారు. పూర్తి ఆధారాలు సేకరించి, నిజనిర్ధారణ చేసుకున్న తరువాతనే అతడిని సంఘం ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించినట్లు వివరించారు. అనంతరం డీపీఎస్ ఫణికుమార్‌ను సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకుని ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, గుర్రం చెన్నకేశవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం నారాయణరెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, తరాల పరమేష్‌యాదవ్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో ప్రజలు సంతోషంగా లేరు

- ఏ గ్రామానికి వెళ్లినా జనం కన్నీటి గాథలే..
- కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదల కష్టాలు తీరుస్తాం
- రేషన్‌షాపుల ద్వారా నిత్యావసర సరుకులు ఇస్తాం
- సీఎల్పీ నేత భట్టివిక్రమార్క



బస్వాపురంలో మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

భువనగిరిటౌన్: తాను చేస్తున్న పాదయాత్రంలో ఏ గ్రామానికి వెళ్లి చూసినా పేద ప్రజల కష్టాలే కనిపిస్తున్నాయని, ఎక్కడ కూడా జనం సంతోషంగా లేరని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క అన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర బుధవారం రాత్రి భువనగిరి మండలం బస్వాపురం గ్రామానికి చేరుకుంది. డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన బస్వాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ భట్టి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వాయర్‌ల పేరుతో నిధులు దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే ముందుచూపుతో బస్వాపురం రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారని అన్నారు. నిరుపేద ప్రజలు ఆకలితో అలమటిస్తుంటే.. మైసూర్ ప్యాలెస్, బృందావన్ పార్కులు చేస్తామని ఈ ప్రభుత్వం చెబుతోందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు ఇస్తామని, రూ.500కే గ్యాస్ ఇస్తామన్నారు. డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. పాదయాత్ర చేస్తున్న భట్టి విక్రమార్కను చూస్తే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్‌ను చూసినట్లు ఉందన్నారు. ఎర్రటి ఎండలో పాదయాత్ర చేసిన సమస్యలు అడిగి తెసుకున్న వైఎస్సార్ అడుగు జాడలో పాదయాత్ర చేయడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. పాదయాత్రలో గుర్తించిన సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి వాటిపై భట్టి విక్రమార్క పోరాటం చేస్తారన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని, పేద ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. అంతకుముందు కాంగ్రెస్ నాయకులు బస్వాపురం రిజర్వాయర్ వద్ద జరుగుతున్న పనులు పరిశీలించి రైతు, గ్రామ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమకు పరిహారం రాలేదని ముంపు గ్రామాల ప్రజలు భట్టి దృష్టికి తీసుకువచ్చారు. భట్టి, అనిల్‌కుమార్‌రెడ్డిలను కాంగ్రెస్ కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చెరుకు సుధాకర్, నాయకులు ప్రమోద్‌కుమార్, రవికుమార్, చిక్కుల వెంకటేశం, నర్సింహ పాల్గొన్నారు.

ధాన్యం అమ్మకానికి అష్టకష్టాలు

- కొనుగోళ్లలో జాప్యంతో కేంద్రాల్లోనే రైతుల పడిగాపులు
- అకాల వర్షాలకు తడిసి మొలకలొస్తున్న ధాన్యం
- పలు చోట్ల పైసలిస్తేనే కాంటా వేస్తున్న హమాలీలు
- సగం కూడా పూర్తికాని కొనుగోళ్లు

మిర్యాలగూడ : ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం అమ్మకానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రాశులు పోసి నెలలు గడుస్తున్నా కాంటాలు పూర్తికాక, కాంటా వేసిన ధాన్యం మిల్లులకు తరలింపులో జాప్యం అవతుండడం, అకాల వర్షాలతో ధాన్యం నీటి పాలవుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. పలు చోట్ల హమాలీలు, లారీ డ్రైవర్ల వసూళ్ల పర్వంతో కాంటాల్లో జాప్యం జరుగుతోంది. కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తనిఖీల బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తూ కొనుగోళ్లు, ఎగుమతి, దిగుమతిలో వేగం పెంచేలా చర్యలు తీసుకుంటున్నాయి. కానీ, అకాల వర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.



అవంతీపురం మార్కెట్‌లో తడిసిన ధాన్యం

→ మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం మార్కెట్‌లోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ఓ మహిళా రైతుకు సీరియల్ ప్రకారం నిర్వాహకులు గన్నీ బ్యాగులు ఇచ్చారు. కానీ హమాలీలు కాంటా వేసేందుకు ముందుకు రాలేదు. పైసలిస్తేనే కాంటా వేస్తామని చెప్పారు. ఆ మహిళా రైతు డబ్బులు ఇవ్వకపోవడంతో ఆ ధాన్యం కాంటా వేయలేదు. బుధవారం కురిసిన వర్షానికి ఆమె ధాన్యం పూర్తిగా తడిసిపోయింది.



ధాన్యం బస్తాలపై పట్టాలు కప్పుతున్న రైతులు

→ త్రిపురారం మండలం లోక్యాతండాలోని ఐకేపీ కేంద్రంలో నెల రోజుల క్రితం కొనుగోళ్లు ప్రారంభించారు. కేంద్రంలో 14వేల బస్తాల వరకు ధాన్యం రాశులు ఉండగా 2వేల బస్తాల కాంటా వేశారు. వాటిని మిల్లులకు తరలించడానికి లారీలు రాకపోవడంతో బస్తాలు కేంద్రాల్లోనే ఉన్నాయి. మరోవైపు కాంటా వేసిన ధాన్యం మూడు రోజుల క్రితం తడవడంతో బస్తాలోనే మొలకలు వచ్చాయి.

346 కేంద్రాల ఏర్పాటు
జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లకు 346 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 169 ఐకేపీ, 174 పీఏసీఎస్, 3 ఎఫ్‌పీఓ కేంద్రాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి వస్తుందని అందులో 8లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా 109 మిల్లులకు సీఎంఆర్‌కు కేటాయించారు. ఇప్పటివరకు 33,549 మంది రైతుల వద్ద 2.63 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇంకా సుమారు 5.37లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాల్లో నిల్వ ఉంది.

పైసలు ఇస్తేనే కాంటాలు..
కేంద్రాల వద్ద ధాన్యం కాంటా వేయించడం, బస్తాలను మిల్లులకు తరలించడం ప్రయాసగా మారుతోంది. కేంద్రాల్లో సీరియల్ ప్రకారం రైతులకు టోకెన్లు, గోనె సంచులు ఇస్తున్నా.. హమాలీలు కొందరు రైతులు డబ్బులు ఇస్తేనే కాంటాలు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో హమాలీలను మందలించినా.. హమాలీల్లో మార్పు రాలేదని రైతులు అంటున్నారు. మరోవైపు కేంద్రాల వద్ద కాంటా వేసిన బస్తాలను ఎగుమతి చేసేందుకు సరైన సమయంలో లారీలు రావడం లేదు. బస్తాకు రూపాయి చొప్పున లారీ డ్రైవర్‌కు ఇస్తేనే ఆ కేంద్రాలకు లారీలు కేటాయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పైసలు ఇవ్వని కేంద్రాల వద్ద రోజుల తరబడి ధాన్యపు నిల్వ ఉంటున్నాయి.

ఎగుమతి, దిగుమతిపై దృష్టిపెట్టాం



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలను ఎప్పటికప్పుడు ఎగుమతి, మిల్లర్లు వాటిని దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక బృందాలు నిత్యం పర్యవేక్షిస్తూ కేంద్రాల్లో ధాన్యం బస్తాలు నిల్వ ఉంచకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాయి. ధాన్యం కొనుగోళ్లలో నల్లగొండ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది.

– వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ

పంట పండించినా సుఖం లేదు



కష్టపడి పండించిన పంట దిగుబడి ఆశాజనకంగానే వచ్చింది. తీరా అమ్ముకుందామని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు ధాన్యాన్ని తీసుకొచ్చా. ఇక్కడ మాత్రం కొనుగోలు చేయడంలో జాప్యం చేస్తున్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసింది. ఏం చేయాలో పాలుపోని దుస్థితి నెలకొంది. పంట పండించినా సుఖం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు ధాన్యం కొనుగోలు చేసి ఆదుకోవాలి.

– నాగమణి, రైతు, గూడూరు, మిర్యాలగూడ మండలం

క్లుప్తంగా

భానుప్రకాష్ గౌడ్‌కు డాక్టరేట్


భానుప్రకాష్ గౌడ్

నల్లగొండ: నల్లగొండ విద్యా శిక్షణా సంస్థ (డైట్) ఈఎల్‌టీసీ ఫ్యాకల్టీ తండు భానుప్రకాశ్ గౌడ్ డాక్టరేట్ పట్టా పొందారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగంలో 2008 నుంచి పార్ట్ టైం పరిశోధక విద్యార్థి అయిన భానుప్రకాశ్ గౌడ్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.ఈ.ఎస్. ఎలిజబెత్ పర్యవేక్షణలో ఉపాధ్యాయుల మెటాకాగ్నిషన్ అవగాహన, సంస్థాగత నిబద్ధత, సెకండరీ విద్యార్థుల విద్యాపనితీరుపై ఎలాంటి ప్రభావం కలిగి ఉందనే అంశంపై పరిశోధనలు చేసి యూనివర్సిటీకి సమర్పించారు. ఈమేరకు ఆయనకు ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (డాక్టరేట్)ను ప్రదానం చేసినట్లు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, రీసెర్చ్ సెల్ అండ్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి బుధవారం తెలిపారు.

మెట్లపై నుంచి జారిపడి వ్యక్తి మృతి


తరుణ్ (ఫైల్)

మర్రిగూడ: రాత్రి వేళ నిద్రించేందుకు ఇంటి మిద్దెపైకి వెళ్తూ మెట్లపై నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. మర్రిగూడ మండలంలోని కుదభాక్షపల్లి గ్రామ పరిధిలోని సాయిబండాతండాకు చెందిన నేనావత్ తరుణ్(23) కుదభాక్షపల్లి గ్రామ పంచాయతీకి సంబంధించిన తాత్కాలిక ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి నిద్రించేందుకు తరుణ్ తన ఇంటి మిద్దె ఎక్కుతున్న క్రమంలో మెట్ల పైనుంచి జారిపడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబసభ్యులు తరుణ్‌ను వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి బుధవారం తరుణ్ మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబసభ్యులకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

విద్యుదాఘాతానికి గురై..


ఆంజనేయులు (ఫైల్)

భువనగిరి: మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సుబ్బూరు ఆంజనేయులు(33) బుధవారం వ్యవసాయ బావి వద్ద పొలానికి నీరు వెళ్లే కాల్వను సరిచేస్తున్నాడు. అప్పటికే రాత్రి వచ్చిన ఈదురు గాలులకు తెలిన వి ద్యుత్ సర్వీస్ వైరు తెగి కిందపడి ఉంది. ఈ క్రమంలో అతడికి విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. సమీపంలో ఉన్న అతడి సోదరుడు రాజు గమనించి ఆంజనేయులును ప్రమాదం నుంచి రక్షించే క్రమంలో తాను విద్యుత్ షాక్‌కు గురికావడంతో అక్కడే ఉన్న రాజు భార్య సంధ్య వెంటనే కర్రతో విద్యుత్ వైర్లను తొలగించింది. వెంటనే స్థానికులు ఇద్దరిని చికిత్స నిమిత్తం భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి ఆంజనేయులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. రాజు చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి బీరప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

స్కూటీ డిక్కీలో పెట్టిన నగదు మాయం

హుజూర్‌నగర్: స్కూటీ డిక్కీలో పెట్టిన నగదు అపహరణకు గురైంది. ఈ సంఘటన బుధవారం హుజూర్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అమరవరం గ్రామానికి చెందిన రైతు దార రవీంద్ర తన యాసంగి పంట అమ్మగా వచ్చిన రూ.1.90లక్షలను ఎస్‌బీఐ నుంచి డ్రా చేసి తన స్కూటీ డిక్కీలో పెట్టుకున్నాడు. పట్టణంలోని శాంతి స్థూపం వద్ద స్కూటీ ఆపి తాళం చెవి దానికే ఉంచి పండ్లు కొనేందుకు వెళ్లాడు. ఇంతలో గుర్తు తెలియని వ్యక్తి డిక్కీ తాళం తీసి అందులో ఉన్న రూ 1.90 లక్షలను అపహరించాడు. రవీంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శ్రీకృష్ణాలంకార సేవలో నృసింహుడు

- వైభవంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి జయంత్యుత్సవాలు
- ఉదయం శ్రీకృష్ణ అలంకారం.. సాయంత్రం రామావతార సేవలో దర్శనమిచ్చిన స్వామివారు


లక్షపుష్పార్చన పూజ నిర్వహిస్తున్న ఆచార్యులు


శ్రీకృష్ణ అలంకార సేవకు హారతినిస్తున్న ప్రధానార్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీస్వామి వారి జయంత్యుత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన బుధవారం స్వామివారు కాళీయ మర్దనుడిగా శ్రీకృష్ణ అలంకార సేవలో దర్శనమిచ్చారు. ప్రధానాలయంలో శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాతం, అభిషేకం, అర్చనలు జరిపించారు. ఆలయ ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, వేద పండితులు, పారాయణీకుల సమక్షంలో శ్రీస్వామి వారికి నిత్య హవనం, మూలమంత్ర జపాలు, లక్ష్మీసూక్త శ్రీవిష్ణు సహస్రనామ పారాయణాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయ ముఖ మండపంలోని ఉత్సవ మూర్తుల చెంత లక్ష పుష్పార్చన పూజలు చేపట్టారు. పుష్పాలు, తులసీ పత్రాలతో శ్రీస్వామి అమ్మవార్లను అర్చించారు. స్వామివారు అనంతరం కాళీయ మర్దన– శ్రీకృష్ణ అలంకార సేవను ఊరేగించారు.

సాయంత్రం హనుమంత వాహనంపై..

ఆలయంలో సాయంత్రం నిత్య హవనం, సామూహిక పారాయణాలు, నృసింహ మూలమంత్ర హవనం జరిపించారు. అనంతరం హనుమంత వాహనంపై శ్రీరామావతార అలంకార సేవలో ఊరేగారు. ఆయా వేడుకల్లో ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉదయం అభిషేకాలు, లక్ష పుష్పార్చన జరిపించారు. సాయంత్రం నృసింహ మూలమంత్ర హవనం నిర్వహించారు. అదేవిధంగా శ్రీవీరప్రతాప మారుతీ భజన మండలి గుండ్లపల్లి, శ్రీభాగ్యలక్ష్మి మహిళా భజన మండలి యాదగిరిగుట్ట వారిచే భజన కార్యక్రమాలు, సాయంత్రం మధుర ధ్వని బృందం ముంబాయి వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు, అభినయ కూచిపూడి నృత్యాలయం వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు.

నేటితో ఉత్సవాలు ముగింపు

శ్రీస్వామివారి జయంత్యుత్సవాలు గురువారం ముగియనున్నాయి. ఉదయం 7గంటలకు మూల మంత్ర హవనం జరిపిస్తారు. 9గంటల నుంచి 9.30గంటల వరకు పూర్ణాహుతి, సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 7గంటలకు నృసింహ జయంతి, నృసింహ ఆవిర్భావం, మహా నివేదన, తీర్థ ప్రసాద గోష్టి గావించి ఉత్సవాలు పరిసమాప్తం చేస్తారు.

అఖండ నృసింహ సంకీర్తన


సంకీర్తన చేస్తున్న జానపద కళాకారులు

నృసింహ జయంతి సందర్భంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో తొలిసారి 24 గంటల పాటు అఖండ హరినామ సంకీర్తన నిర్వహిస్తున్నారు. కొండ కింద గల శ్రీ సత్య నారాయణ వ్రత మంటపంలో బుధవారం ఉదయం 11గంటలకు మొదలైన అఖండ గానం గురువారం ఉదయం 10 గంటల వరకు కొనసాగనుంది. తిరుపతి అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి విజయశంకర స్వామి ఆధ్వర్యంలో తెలంగాణ జానపద కళాకారులు నృసింహ సంకీర్తన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ గీతారెడ్డి, ప్రధానార్చకులు నల్లంథీగళ్ లక్ష్మీనరసింహాచార్యులు, బిర్లా మందిర్ ప్రధాన అర్చకులు లక్ష్మీనరసింహాచార్యులు, ఆలయ ఏఈఓ కృష్ణ, శ్రవణ్ యాదాద్రి బుచ్చిదాసు ఆశ్రమ అధిపతి శివానంద స్వామి, జానపద వృత్తి కళాకారుల సంఘం గౌరవాధ్యక్షురాలు డాక్టర్ అనూహ్యారెడ్డి, చినుకు కల్చరల్ సొసైటీ అధ్యక్షుడుమూర్తి, సంఘం అధ్యక్షుడు వినోద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో తిరుకల్యాణోత్సవాలు ప్రారంభం


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఆలయ అనువంశిక ధర్మకర్తలు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈనెల 8వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణోత్సవాలను బుధవారం రాత్రి ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, చెన్నూరు విజయ్‌కుమార్, అర్చకులు వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ బొర్రా వాసుదేవాచార్యుల పర్యవేక్షణలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, అఖండ దీపారాదన, మృత్యంగ్రహణం, అంకురారోపణం గావించారు. అనంతరం ధ్వజారోహణం నిర్వహించారు. నవకుంభారోపణం, అగ్నిప్రతిష్టాపన, తదితర పూజా కార్యక్రమాలు జరిపించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా గురువారం లక్ష మల్లికాపుష్ప పూజతోపాటు, ఎదుర్కోళ్ల సంవాదం నిర్వహించి, స్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలంకరణతో వధూవరులుగా అలంకరించి అర్ధరాత్రి నుంచి తిరుకల్యాణం నిర్వహించనున్నట్లు ధర్మకర్తలు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు రామాచార్యులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, బ్రహ్మాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయా చార్యులు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి..

మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో జరుగుతున్న తిరుకల్యాణోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, చెన్నూరు మట్టపల్లిరావు తెలిపారు. బుధవారం స్థానిక దేవాలయ ఆవరణలో నూతన పాలకమండలి నిర్వహించిన సమావేశం అనంతరం వారు మాట్లాడారు. మహిళలకు అదనంగా డ్రెస్సింగ్ రూములు, లైటింగ్, పూల డెకరేషన్, మరుగుదొడ్ల ఏర్పాటు, పారిశుధ్యం పనులు చేపట్టేలా తీర్మానించడం జరిగిందని చెప్పారు. సమావేశంలో పాలకమండలి సభ్యులు కె.వెంకటనారాయణ, కొండల్‌రెడ్డి, శేషిరెడ్డి, రామయ్య, ఫణికుమార్, వెంకటేశ్వర్లు, ప్రకాశ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, ఈఓ నవీన్ తదితరులున్నారు

స్వయం ఉపాధి శిక్షణను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న రఘుపతి

చిలుకూరు: చిలుకూరు మండలంలోని సీతారాంపురం గ్రామంలో బుధవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో యువతకు స్వయం ఉపాధిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా డైరెక్టర్ రఘుపతి మాట్లాడుతూ యువత శిక్షణను స్వదినియోగం చేసుకొని ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పులగం రవీంద్రకుమార్, వాల్యా నాయక్, వీబీకే కవిత తదితరులు పాల్గొన్నారు.

మిల్లులపై దాడి కేసులో నలుగురికి రిమాండ్


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ శ్రీను

వేములపల్లి: రైస్ మిల్లు డ్రైవర్ మృతి చెందడంతో చేపట్టిన మిల్లుల బంద్‌కు సహకరించడం లేదని రైస్ మిల్లులపై దాడి చేసి విధ్వంసం సృష్టించిన నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శ్రీను బుధవారం పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామ సమీపంలోగల సూర్య రైస్‌మిల్లులో మిల్లు డ్రైవర్‌గా పనిచేస్తున్న కోల శేఖర్ ప్రమాదవశాత్తు మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని మిల్లు యాజమాన్యం ఆదుకోవాలని కోరుతూ గత నెల 24న మిల్లుల బంద్‌కు పిలుపునిచ్చారు. అదేరోజు వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామ పరిధిలో గల మహాతేజ, మహర్షి, ఆదిత్య రైస్ మిల్లుల్లో బంద్‌కు సహకరించడం లేదని కొంతమంది యూనియన్ నాయకులు అల్లరి మూకలతో కలిసి ఆయా మిల్లుల్లో ఫర్నీచర్, కరెంట్ బోర్డులను ధ్వంసం చేశారు. దీంతో మహాతేజ మిల్లు యజమాని బండారు కుశలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టగా మిల్లులపై దాడి చేసిన మిర్యాగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన కొండేటి చరణ్, గువ్వల లోకేష్, గొల్ల సుమన్, మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఇరిగి వెంకన్నలను గుర్తించి వారిపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించామని, మరికొందరిని సైతం గుర్తించి వారిని కూడా రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.

కత్తితో దాడి.. ముగ్గురికి తీవ్ర గాయాలు


గాయపడిన మచ్చ రాకేష్

త్రిపురారం: మద్యం మత్తులో ఇద్దరు స్నేహితులు గొడవ పడగా.. వీరిలో ఒకరు పగ పెంచుకుని మరొక వ్యక్తి కుటుంబ సభ్యులపై కత్తితో దాడి చేశాడు. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన త్రిపురారం మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం గ్రామంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన మచ్చ రాకేష్, గోపు మహేష్‌రెడ్డిలు స్నేహితులు. వీరిద్దరూ గ్రామంలోని మరో ఎనిమిది మంది స్నేహితులతో కలిసి మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులో ఉన్న ఓ దాబాలో మంగళవారం రాత్రి మద్యం సేవించారు. ఈ క్రమంలో మచ్చ రాకేష్, గోపు మహేష్‌రెడ్డి ఇద్దరూ గొడవ పడి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో మచ్చ రాకేష్‌పై గోపు మహేష్‌రెడ్డి పగ పెంచుకున్నాడు. అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో గోపు మహేష్‌రెడ్డి కత్తి తీసుకొని రాకేష్ ఇంటికి వెళ్లాడు. గేటు వేసి ఉండడంతో పక్కనే ఉన్న పలుగు రాళ్లను తీసుకొని ఇంటిపై విసిరాడు. రాకేష్ తండ్రి మచ్చ వెంకటేశ్వర్లు బయటకు వచ్చి గేటు తీస్తుండడంతో అప్పటికే మద్యం మత్తులో ఉన్న గోపు మహేష్‌రెడ్డి మచ్చ వెంకటేశ్వర్లును కత్తితో పొడిచాడు. రాకేష్ తల్లి అడ్డువెళ్లడంతో ఆమెను కూడా తీవ్రంగా గాయపరిచాడు. మహేష్ రెడ్డి అక్కడి నుంచి వెళ్తుండగా రాకేష్ దారిలో తారసపడే సరికి అతడిపై కూడా కత్తితో దాడి చేసి గాయపరిచాడు. తీవ్రంగా గాయపడిన ఈ ముగ్గురిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడకు తరలించారు. మచ్చ రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు.

దాబాల మాటున మద్యం విక్రయాలు

మండల కేంద్రంలో సాగర్ రోడ్డు వెంట దాబాల మాటున నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా మండల కేంద్రంలో కొంతమంది యువత గంజాయికి అలవాటు పడినట్లు పేర్కొంటున్నారు. మండలంలో కొంత మంది ముఠాగా ఏర్పడి ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి యువతను తప్పుదారి పట్టిస్తున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల క్రితం యువత బహిరంగంగా రోడ్డుపై అల్లర్లకు పాల్పడడంతో పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారని, గతంలో మాదిరిగా గ్రామాల్లో రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్లకు గాయాలు


బక్కమంతులగూడెం వద్ద ఢీకొన్న లారీలు

మఠంపల్లి: మండలంలోని బక్కమంతులగూడెం సమీపంలో ప్రధాన రహదారిపై బుధవారం రెండు సిమెంట్ లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. అందులో ఉన్న ఇరువురు డ్రైవర్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ నుంచి మఠంపల్లి వైపు లారీ వెళ్తోంది. మఠంపల్లి నుంచి హుజూర్‌నగర్ వైపు మరో లారీ వస్తోంది. ఈ క్రమంలో బక్కమంతులగూడెం వద్ద అకస్మాత్తుగా రోడ్డుపైకి గేదెలు రావడంతో వాటిని తప్పించే క్రమంలో రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. వీటి క్యాబిన్లు ధ్వంసం కావడంతో అందులో ఉన్న డ్రైవర్లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి వారిని బయటకు లాగి 108కి సమాచారం ఇచ్చి హుజూర్‌నగర్ వైద్యశాలకు తరలించారు. కాగా.. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మఠంపల్లి పోలీసులు తెలిపారు.

పాటిమట్లలో చోరీ

మోత్కూరు: మండలంలోని పాటిమట్ల గ్రామంలో ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్రామంలో కురుమేటి రమేష్ మంగళవారం రాత్రి ఇంటి ముందు భాగంలో నిద్రిస్తున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వెనుక భాగం నుంచి లోనికి ప్రవేశించి బీరువా తాళం పగులగొట్టి రూ.5 వేలు, సెల్‌ఫోన్ దొంగిలించారు. ఈమేరకు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కల్తీపాలు స్వాధీనం


విచారణ చేస్తున్న పోలీసులు

భూదాన్‌పోచంపల్లి: కల్తీపాలను తయారు చేసి విక్రయిస్తున్న ఓ వ్యక్తి ఇంటిలో ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. కల్తీపాలతో పాటు హైడ్రోజన్ పెరాక్సైడ్, స్కిమ్డ్ పాలప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన భూదాన్‌పోచంపల్లి మండలంలోని జూలూరు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాసుల శేఖర్ అనే పాల వ్యాపారి పాలను కల్తీ చేసి హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు బుధవారం ఇంటిపై దాడి చేసి 100 లీటర్ల కల్తీపాలు, 500 మిల్లీలీటర్ల హైడ్రోజన్ పెరాక్సైడ్, 2 కిలోల స్కిమ్డ్ పాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

ఎంజీయూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- సెనెట్ సమావేశంలో వీసీ గోపాల్‌రెడ్డి

ఎంజీయూ(నల్లగొండ రూరల్) : మహాత్మాగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ) అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వీసీ గోపాల్‌రెడ్డి కోరారు. బుధవారం ఎంజీయూలో నిర్వహించిన సెనెట్ సమావేశంలో వీసీ మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎంజీ యూనివర్సిటీలో సైకాలజీ, ఇంజనీరింగ్‌లో సీఎస్‌ఈ, డిప్లొమా ఇన్ యోగా కోర్సులు ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. విద్యార్థుల నుంచి డిమాండ్ ఉన్న కోర్సులను ప్రారంభిస్తామని చెప్పారు. ఎస్టీ విద్యార్థులకు ప్రత్యేక హస్టల్ భవనం నిర్మిస్తామన్నారు. కరోనా కారణంగా పరీక్షల విధానంలో తీసుకొచ్చిన మార్పులను సవరించి గతంలో మాదిరిగానే పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 30 శాతం ఇంటర్నల్, 70 శాతం ఎక్స్‌టర్నల్ మూల్యాంకన విధానాన్ని ప్రవేశ పెడుతున్నట్లు వెల్లడించారు. యూజీ, పీజీ కోర్సుల్లో ప్రాక్టికల్స్ ఉన్న కోర్సులకు 92 క్రెడిట్లు, ఇతర కోర్సులకు 88 క్రెడిట్లుగా నిర్ణయించినట్లు తెలిపారు. గ్రేడింగ్ విధానంలో మెమోలను అందజేస్తామన్నారు. యూజీసీ విధానాలకు అనుగుణంగా పీహెచ్‌డీలో పరిశోధనలు చేపడుతున్నట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం ఫీజుల్లో మార్పులు చేస్తామన్నారు. ఈ విద్యా సంవత్సరానికి రూ.108 కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు వివరించారు. సమావేశంలో రిజిస్ట్రార్ కృష్ణారావు, మాజీ వీసీ గంగాదర్, అధ్యాపకులు అంజిరెడ్డి, శ్రీదేవి, ఆకుల రవి, ఘనశ్యాం, కోటేశ్వర్‌రావు, ఏఎస్‌ఎన్ రెడ్డి, కిషన్, అరుణప్రియ, రేఖ, రమేష్, మాధవి, మద్దిలేటి, ప్రేమ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చేందుకే 'డబుల్' ఇళ్లు


డబుల్ బెడ్ రూం ఇళ్లను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

- నల్లగొండ జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి : పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకే సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇస్తున్నారని నల్లగొండ జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నార్కట్‌పల్లి మండలంలోని నక్కలపల్లి గ్రామంలో ఆయన ఇచ్చిన రెండు ఎకరాల స్థలంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా బండా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల కలనేరవేరాలనే ఉద్దేశ్యంతో పాటు, తన తల్లిదండ్రులు బండా చంద్రారెడ్డి–పిచ్చమ్మల జ్ఞాపకార్థంగా ఇళ్ల నిర్మాణానికి రెండు ఎకరాల స్థలం ఇవ్వడం జరిగిందని తెలిపారు. తన సొంత గ్రామమైన నక్కలపల్లిని నియోజకవర్గంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. 72 ఇళ్లకు గాను 64 గృహాలు పూర్తి కావడంతో వాటిని డ్రా పద్ధతిలో అందించామని, మిగిలిన 8 గృహాలను త్వరలోనే పూర్తి చేయించి అర్హులకు అందజేస్తామని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ బలపరిచిన ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో 698 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు కాగా కేవలం నక్కలపల్లిని గ్రామంలోనే మొదటి సారిగా ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా రూ.50 లక్షల విలువ గల రెండు ఎకరాల భూమిని ఇళ్ల నిర్మాణానికి విరాళంగా ఇచ్చిన బండా నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యానాల అశోక్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బండా జగన్మోహన్‌రెడ్డి, నక్కలపల్లి సర్పంచ్ ఈద మాధవి, ఉప సర్పంచ్ సైదులు, ఎంపీటీసీ సావిత్రికుమారాస్వామి, మాజీ ఎంపీటీసీ సత్తయ్య, సర్పంచులు, పార్టీ మండల ప్రచార కార్యదర్శి రవికుమార్, హౌజింగ్ పీడీ రాజ్‌కుమార్, పీఆర్ ఈఈ తిరుపతయ్య, తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ యాదగిరి తదితరులున్నారు.

మిషన్ పల్టీ కొట్టడంతో మహిళ మృతి


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

చింతపల్లి: ప్రమాదవశాత్తు వేరుశనగ మిషన్ పల్టీ కొట్టడంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన బుధవారం చింతపల్లి మండల పరిధిలోని హోమంతాలపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం ఇద్దంపల్లి గ్రామానికి చెందిన పేర్ల పోచమ్మ(54) గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. దేవరకొండ మండల పరిధిలోని జటావత్ తండాలో పని ముగించుకొని బుధవారం గ్రామానికి చెందిన మేరెడ్డి రవీందర్‌రెడ్డి వేరుశనగ మిషన్ వాహనంపై ఇద్దంపల్లికి వస్తున్నారు. హోమంతాలపల్లి గ్రామ శివారులో రవీందర్‌రెడ్డి వేరుశనగ మిషన్ వాహనాన్ని అజాగ్రత్తగా నడపడంతో వాహనం బోల్తా కొట్టింది. దీంతో వాహనంపై ఉన్న పోచమ్మ అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురు మహిళా కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు పేర్ల యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రంలో రైతుల నిరసన


యల్లారెడ్డిగూడెంలో నిరసన తెలుపుతున్న రైతులు

నార్కట్‌పల్లి : మండలంలోని యల్లారెడ్డిగూడెం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో 100 కేజీలకు 5కేజీల ధాన్యాన్ని కట్ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం రైతులు కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. పీఏసీఎస్ సిబ్బంది, మిల్లర్లు కుమ్మక్కై కొద్ది రోజులుగా రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని తేమ, మ్యాచర్ రావడం లేదనే సాకుతో 5కేజీల వరకు తరుగును తీస్తున్నారని ఆరోపించారు.

దళితబంధు పథకంపై విచారణ జరిపించాలి


తిరుమలగిరిలో నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

తిరుమలగిరి : దళిత బంధు పథకంలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, దీనిపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అఖిలపక్ష నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం తిరుమలగిరిలో వారు నిరసన తెలిపారు. అంతకుముందు తొండ గ్రామంలో దళిత బంధు పథకం లబ్ధిదారులతో మాట్లాడారు. తిరుమలగిరి మండలం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైనందున మండలంలోని దళిత కుటుంబాలందరికీ ఎంతో మేలు జరుగుతుందని అనుకుంటే ఒక్కో లబ్ధిదారుడికి రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు మాత్రమే యూనిట్ల ద్వారా అందాయని ఆరోపించారు. లబ్ధిదారుల నుంచి కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున కమీషన్లకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే తిరుమలగిరి మండలంలో విజిలెన్స్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందుకూరి సోమయ్య, వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న, కాంగ్రెస్ నాయకులు గుడిపాటి నర్సయ్య, జ్ఞానసుందర్, బీజేపీ నాయకులు వై.దీన్‌దయాళ్, కడెం లింగయ్య, ఎల్లంల యాదగిరి, కందుకూరి అంబేద్కర్, బొజ్జ సైదులు, బోడ సునీల్, శ్రీను, అబ్బాస్, శ్రీకాంత్, ప్రశాంత్ పాల్గొన్నారు.